అన్నదాతల గుండెల్లో గుబులు

- వర్షంతో ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు నానా తిప్పలు
- ఇదే అదనుగా ధరలు తగ్గించి దళారులు దోపిడీ



ముంబయి జాతీయ పక్కన ఆరబోసిన ధాన్యాన్ని వర్షంతో పట్టలతో కప్పి ఉంచుతున్న రైతులు

సంగం: ధాన్యం ధరల్లేక విలవిల్లాడుతున్న అన్నదాతల గుండెల్లో అకాల వర్షం గుబులు రేపుతోంది. మండలంలో పది వేల ఎకరాల్లో ఎడగారు పంట సాగుచేపట్టారు. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే ఐదు వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. పెరమన, సంగం, దువ్వూరు, సిద్ధీపురం, వంగల్లు, మర్రిపాడు తదితర గ్రామాల్లోని రైతులు కల్లాల్లేక ధాన్యాన్ని ముంబయి రోడ్డు వెంబడి ఆరబోసుకుంటున్నారు. రెండ్రోజులుగా ఉదయం ఎండ కాస్తూ మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై వర్షం కురుస్తుండడంతో ఆరబోసుకున్న ధాన్యాన్ని పట్టలతో కప్పిపెట్టుకునేందుకు అన్నదాతలు నానా తంటాలు పడుతున్నారు. మరోవైపు ఇదే అదనుగా భావించి దళారులు రైతులను దోచుకుంటున్నారు. ఎడగారు కోతల ప్రారంభంలో కేఎన్ఎం 1638 రకం ధాన్యం పుట్టి ధర రూ.17 వేలు ఉండగా, ప్రస్తుతం పుట్టి రూ.15,300కే కొనుగోలు చేస్తున్నారు. అలాగే 1010 రకం ధాన్యం పుట్టి రూ.15వేల వంతున కొనుగోలు చేయగా, వర్షంతో రూ.13,400కు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. వర్షానికి ధాన్యం పాడవుతుందనే బెంగతో రైతులు వచ్చినకాడికి తెగనమ్ముకుంటున్నారు. ధాన్యం దళారుల పంట పండిస్తుండగా, రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోతూ లబోదిబోమంటున్నారు. దళారులు మద్దతు ధర కన్నా తగ్గించి కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నా జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులు నోరు మెదపకపోవడం, జిల్లా అధికార యంత్రాంగం పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.



వర్షంలోనే ధాన్యం విక్రయిస్తున్న రైతులు

అథ్లెటిక్స్ పోటీలకు 30 మంది ఎంపిక



పోటీల్లో డిప్యూటీ డీఈఓ ఎంవీ జానకీరాం, తరుణవాయి, సంగం ఉన్నత పాఠశాల హెచ్ఎంలు శ్రీనివాసులు, బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

సంగం: మండల స్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్‌లో సత్తాచాటి ఆత్మకూరు నియోజకవర్గ స్థాయికి 30 మంది ఎంపికయ్యారని తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ చెన్నయ్య శుక్రవారం తెలిపారు. తరుణవాయి పాఠశాలలో అండర్–14,17 బాలబాలికల విభాగాల్లో అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. ఏడు పాఠశాలలకు చెందిన 110 మంది బాలబాలికలకు పాల్గొనగా ప్రతిభకనబర్చిన 30 మందిని నియోజకవర్గస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. కాగా క్రీడా

ఆరోగ్యవంతమైన మహిళ కుటుంబానికి గట్టి పునాది



గర్భిణులకు పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న సీడీపీఓ సునీలత

ఆత్మకూరురూరల్: ఆరోగ్యవంతమైన మహిళ ప్రతి కుటుంబానికి శక్తివంతమైన పునాదిగా ఉంటుందని ఆత్మకూరు ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత పేర్కొన్నారు. మహిమలూరులో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. సీడీపీఓ ముఖ్యఅతిథిగా హాజరై పోషకాహారం, పిల్లల్లో స్థూలకాయం నివారణ, బాల్యదశ సంరక్షణ, విద్య, శిశు, చిన్నపిల్లల ఆహారపు అలవాట్లు, పురుషుల భాగస్వామ్యం, పోషణ, సంరక్షణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు పోషకాహారం కిట్లను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, కస్తూరి, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయం కోసం విజ్ఞప్తి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆండ్రా ప్రసాద్

చేజర్ల(సోమశిల): చేజర్ల మండలం మడపల్లి గ్రామానికి చెందిన పేద రైతు కుటుంబానికి చెందిన ఆండ్రా ప్రసాద్ అనే యువకుడు పంటకు రసాయన మందు పిచికారీ చేసే క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పొలంలోనే పడిపోగా గమనించిన బంధువులు ఆస్పత్రికి తరలించారు. అతన్ని పరిశీలించిన వైద్యులు విషపూరితమైన పురుగు మందు తుంపరలు నోరు, ముక్కు, కళ్లు, చర్మం ద్వారా శరీరంలోకి వెళ్లి అవయవాలపై తీవ్ర ప్రభావం చూపిందని గుర్తించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఇప్పటికే శక్తికి మించి ఖర్చు చేసిన కుటుంబసభ్యులు దాతల సాయం కోసం వేడుకుంటున్నారు. మానవత్వంతో ఆర్థిక సాయం అందించే దాతలు 93903 49417 నంబర్‌కు ఫోన్‌పే చేయాలని విజ్ఞప్తి చేశారు.

మహిమలూరులో క్షేత్ర దినోత్సవం



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో క్షేత్ర దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. స్థానిక రైతు ఇరగన శ్రీనివాసులు ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న వివిధ రకాల పంటలను అధికారులు, ఆదర్శ రైతులు సందర్శించారు. ఏ గ్రేడ్ మిరాకిల్ రైజెడ్, ఏటీఎం మోడళ్లను అధ్యాయనం చేశారు. ప్రకృతి వ్యవసాయం అడిషనల్ డీపీఎం మునిరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ఆదర్శ రైతులు తమ అనుభవాలను వివరించారు. ఆత్మకూరు ఏఓ కిషోర్‌బాబు, ఏడీఏలు, వీఏఏలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోండి



ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావనిని సీపీఎం నాయకులు శుక్రవారం కలిశారు. సంగం మండలం పెరమన వద్ద రెండ్రోజుల క్రితం ఇసుక టిప్పర్ ఏడుగురు అమాయకుల ప్రాణాలను బలిగొన్న నేపథ్యంలో ఆర్డీఓకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. 67వ నంబరు జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించి డివైడర్లు ఏర్పాటు చేయాలని, ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసి వాటి యజమానులపై కేసులు నమోదు చేయాలని కోరారు. ప్రమాదానికి కారణమైన వాహన యజమానుల నుంచి బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారి సమీపంలో మద్యం దుకాణాలను తొలగించాలని, ఆత్మకూరులోని మద్యం దుకాణాలను సమయాన్ని పాటించి తెరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్‌రాజు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందానీ, నాయకులు ఆత్మకూరు నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మస్తాన్‌వలి గంధ మహోత్సవం

సోమశిల: అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి బస్టాండ్ సెంటర్‌లోని కసుమూరు మస్తాన్‌వలి దర్గాలో గంధ మహోత్సవాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు.తొలుత దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించి జెండా చెట్టు, మస్తాన్‌వలి పీరును శుభ్రపరిచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి గంధం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గంధాన్ని దర్గా వద్దకు చేర్చి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. శనివారం ఉదయం గంధాన్ని భక్తులకు పంచిపెట్టనున్నట్లు దర్గా నిర్వాహకులు ఉప్పుటూరి మస్తానయ్య తెలిపారు.

పొగాకు గరిష్ట ధర రూ.345

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.345 పలికింది. వేలానికి 858 బేళ్లు రాగా, 547 బేళ్లను విక్రయించారు. కిలో పొగాకు గరిష్టంగా రూ.345, కనిష్టంగా రూ.90, సగటున రూ.171.94 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

పేదలకు అన్నదానం



కావలి(అల్లూరు): విజయ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కావలిలోని చెరువుకట్ట గిరిజన కాలనీలోని పేదలకు శుక్రవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తన స్నేహితుడు ఎన్ఆర్ఐ సౌరబ్ కపూర్ కూమారుడు కైరా కపూర్ జన్మదినాన్ని పురస్కరించుకుని అన్నదానం చేసినట్లుగా తెలిపారు.


మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న మున్సిపల్ కార్మికులు

కావలి(అల్లూరు): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఉపాధ్యక్షుడు పీ పెంచలయ్య కోరారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో కావలి మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. తమ సమస్యలపై కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కాలయాపన చేస్తుందన్నారు. జూలై నెలలో సమ్మె చేపట్టిన కార్మికులకు వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.7 లక్షలు, మట్టి ఖర్చులకు రూ.20 వేలు, వయస్సు పేరుతో తొలగించిన కార్మికుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి పని కల్పించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ సభ్యులు ప్రవీణ్, క్రాంతి, శీనయ్య, రమేష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చిరాగా ఉత్సవం



దీపాల కాంతుల్లో కోనేరు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజా నాయబ్ రసూల్ దర్గాలో గంధ మహోత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి చిరాగా ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంధ మహోత్సవం ముగిశాక దర్గా ఆవరణలోని కోనేరులో భక్తులు దీపాలు వెలిగించడం ఆనవాయితీ. అందులో భాగంగా గంధ మహోత్సవానికి వచ్చిన భక్తులు కోనేరులో దీపాలను వెలిగించారు.తొలుత దర్గా సజ్జదా హఫీజ్‌బాషా దీపాన్ని వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా ఈఓ హుస్సేన్ పాల్గొన్నారు.

నేడు, రేపు అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

ఆత్మకూరురూరల్: పట్టణంలోని ఎస్ఆర్‌జే డిగ్రీ కళాశాలలో ఈ నెల 20, 21 తేదీల్లో అంతర్ కళాశాలల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ వర కుమారి, వ్యాయామ అధికారి సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, చెస్, టగ్‌ఆఫ్ వార్, తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథిగా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ కసుమూరి సునీత , అతిథులుగా డాక్టర్ సీహెచ్ వెంకటరాయులు, వీఎస్‌యూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ, జవహర్ భారతి కళాశాల పీడీ ప్రసాద్‌రెడ్డి, తదితరులు హాజరై పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. వీఎస్‌యూ పరిధిలోని కళాశాలల విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొనాలని కోరారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



అల్లూరు: పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని నగర పంచాయతీ డీడీఓ వరప్రసాద్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అల్లూరులోని బాపూజీ పార్క్ ఆవరణలో పారిశుధ్య కార్యక్రమాలను శుక్రవారం చేపట్టారు. పార్కులోని చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని తెలిపారు.

ఎన్ఎంఎస్‌తో ప్రతిభావంతులకు చేయూత

- దరఖాస్తునకు నెలాఖరు వరకు గడువు
- డిసెంబరు 7న పరీక్ష
- ఎంపికైతే ఏడాదికి రూ.12వేలు ఉపకారవేతనం

దుత్తలూరు : విద్యార్థుల్లో ఎంతటి ప్రతిభ ఉన్నా ఆర్థిక స్థోమత లేక ఉన్నత విద్యకు దూరమవుతూ పాఠశాల విద్యకే పరిమితమవుతున్నారు. అలాంటి ప్రతిభగల పేద విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకమే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్). ఈ పథకం ద్వారా ఎంతో మంది ప్రతిభ గల విద్యార్థులు ఉన్నత చదువులకు బాటలు వేసుకుంటున్నారు. ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థులకు నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం అందుతుంది. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున రూ.48 వేలు అందజేస్తారు. ఈ ఏడాది డిసెంబర్ 7న ఎన్ఎంఎస్ ప్రవేశ పరీక్ష జరగనుంది. అందుకు సంబంధించి విద్యార్థులు సెప్టెంబర్ 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

పరీక్ష విధానం ఇలా..

ఈ ఏడాది 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఉపకారవేతనానికి అర్హులు. 7వ తరగతిలో జనరల్, బీసీ విద్యార్థులు 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ లు 50 శాతం మార్కులు సాధించాలి. ప్రవేశ పరీక్ష 180 మార్కులకు ఉంటుంది. రీజనింగ్, అర్థమెటిక్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెకులపై ప్రశ్నలు ఉంటాయి. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లిస్తే సరిపోతుంది.

మెరిట్ ప్రాతిపదికన ఎంపిక

ఎన్ఎంఎస్ ప్రవేశ పరీక్ష ఆధారంగా ఉపకార వేతనానికి ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉపకార వేతనం అందుతుంది. 2008–09లో ప్రారంభించిన ఈ పథకానికి ఏటా 8వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తారు. గతంలో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.6వేల వంతున అందజేసేవారు. ప్రస్తుతం దీనిని ప్రభుత్వం రెట్టింపు చేసింది. దీంతో విద్యార్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఎంపికైన విద్యార్థులకు ఏటా నేరుగా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేస్తారు. ఈ ఏడాది డిసెంబర్ 7న జరిగే ప్రవేశ పరీక్షకు ఇప్పటి నుంచే విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు.

ఉపకార వేతనంతో ప్రయోజనం

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉపకార వేతనం వలన ఎంతో ప్రయోజనం ఉంటుంది. భవిష్యత్తులో విద్యా అవకాశాలు కోసం ఉపకార వేతనం ఉపయోగించవచ్చు. ఉపాధ్యాయులు అందించిన శిక్షణతో పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉపకార వేతనం పొందాను.

–జి మధుప్రియ, ఏపీ మోడల్ పాఠశాల దుత్తలూరు

పోటీ తత్వం అలవడింది

8వ తరగతి స్థాయిలోనే ఇలాంటి పరీక్షలు రాసినందువల్ల పోటీతత్వం అలవడింది. ఉపాధ్యాయుల శిక్షణ ఇవ్వడం వల్ల ఉపకార వేతనం పొందాను. భవిష్యత్తులోనూ పోటీ పరీక్షలను ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం కలిగింది.

– బి లక్ష్మీపూజిత, ఏపీ మోడల్ పాఠశాల, దుత్తలూరు

పారదర్శకంగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న ఏఈఆర్వో రామ్మోహన్

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గ పరిధిలో పారదర్శక ఓటరు జాబితాను రూపొందించేందుకు బీఎల్వోలకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎల్ రామ్మోహన్ అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల తహసీల్దార్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు, కంప్యూటర్ సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై చర్చించారు. ఉదయగిరి నియోజకవర్గంలో 2,41,742 మంది ఓటర్లు ఉన్నారన్నారు. గ్రామాల్లో బీఎల్వోలు అందుబాటులో ఉంటారన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. మరణించిన వారి ఓట్లను తొలగించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు



ఆటోలో నుంచి క్షతగాత్రులను బయటకు తీస్తున్న సీఐ వేమారెడ్డి

సంగం: మండలంలోని దువ్వూరు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు..చెన్నైకు చెందిన ముస్లింలు నెల్లూరు నుంచి తరుణవాయిలోని దర్గాకు వస్తున్నారు. ఈ క్రమంలో దువ్వూరు వద్ద వెనుక వైపుగా వస్తున్న మరో ఆటో ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో బోల్తాపడిన ఆటోలోని చెన్నైకు చెందిన ముగ్గురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. నెల్లూరు వైపు వెళ్తున్న సంగం సీఐ వేమారెడ్డి ప్రమాదాన్ని గమనించి వెంటనే క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. సంగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గ్రీన్ ఏపీ

ఆత్మకూరురూరల్: మున్సిపల్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రీన్‌ఏపీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు జరిగే కార్యక్రమంలో పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు సీహెచ్‌సీలో ప్రత్యేక వైద్యశిబిరం

ఉదయగిరి రూరల్ : స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉదయగిరిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యులు బీఎం ప్రశాంత్‌బాబు శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. గైనకాలజీ, చిన్నపిల్లలు, కంటి, చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధులు, ఎముకలు, కీళ్లు, దంత వైద్య నిపుణులు హాజరై వైద్యపరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఉదయగిరి పరిసర ప్రాంత ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

గుడినరవ పాఠశాల తనిఖీ



ఉదయగిరి రూరల్: మండలంలోని గుడినరవ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ–1 టీ వెంకటేశ్వర్లు శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.ఆయన వెంట హెచ్ఎం శారద, ఉపాధ్యాయులు ఉన్నారు.

సొసైటీ పాలకవర్గ బాధ్యతల స్వీకరణ



దుత్తలూరు: మండలంలోని కమ్మవారిపాళెం సొసైటీ నూతన పాలకవర్గం శుక్రవారం బాధ్యతలు స్వీకరించింది. సొసైటీ అధ్యక్షుడిగా పేలపూడి వెంకటరత్నం, డైరెక్టర్లుగా చుండి హరి గోపాల్‌రెడ్డి, దుంపలగడ్డ సరిత బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి హాజరై నూతన పాలకవర్గాన్ని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ డివిజన్ అధికారి శ్రీనివాసరెడ్డి, సీఈఓ లోకనాథరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



వరికుంటపాడు: మండల నూతన ఎంపీడీఓగా డీవీ రమణారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న ఆయన ఎంపీడీఓగా పదోన్నతి పొంది వరికుంటపాడుకు వచ్చారు. నూతన ఎంపీడీఓకు సీనియర్ సహాయకుడు వెంకటాద్రి, జూనియర్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు స్వాగతం పలికారు.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

సీతారామపురం : మండలంలోని ఘటికసిద్దేశ్వరం క్షేత్రంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 22న సిద్ధేశ్వరీదేవి, 23న బాలా త్రిపుర సుందరీదేవి, 24న వేదమాత గాయత్రీదేవి, 25న అన్నపూర్ణాదేవి, 26న మహాలక్ష్మీదేవి, 27న కాత్యాయనీదేవి, 28న లలితాత్రిపురసుందరీదేవి, 29న సరస్వతీదేవి, 30న మహాదుర్గాదేవి, 1న మహిషాసురమర్దిని, 2న రాజరాజేశ్వరీదేవి అలంకారాల్లో ఇష్టకామేశ్వరీదేవి అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు.

వైభవంగా గంధ మహోత్సవం



సీతారామపురం : స్థానిక జెడ్పీ హైస్కూల్ సమీపంలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో 20వ గంధ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తొలుత హక్కుదారులైన తోటకాలనీకి చెందిన బషీర్ ఇంటి వద్ద నుంచి గంధాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు బ్యాండు వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్ల నడుమ తీసుకొచ్చారు. అనంతరం దర్గాలో మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు జరిపి భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు. దర్గా ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై గంధ ప్రసాదాన్ని స్వీకరించారు.

మద్యం సీసాల ధ్వంసం



ఉదయగిరి: ఉదయగిరి ఎక్సైజ్ శాఖ కార్యాలయ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలను ఎక్సైజ్ అధికారులు శుక్రవారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ లక్ష్మణస్వామి మాట్లాడుతూ జిల్లా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారి శ్రీనివాసులనాయుడు ఆదేశాల మేరకు 2019 నుంచి నమోదైన 151 మద్యం కేసుల్లో పట్టుబడిన 2,153 మద్యం బాటిళ్లను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దీప్తికరంత్, సిబ్బంది పాల్గొన్నారు.